# క్రానికల్స్ ఆఫ్ లవ్

డా॥ వి.చంద్రశేఖరరావు

కథ

## 1

సికింద్రాబాద్. ఫిబ్రవరి నెల. ప్లాట్‌ఫాం చివర్న కూర్చున్నారు శివ, చిత్ర. ప్లాట్‌ఫాంపై మనుషుల ప్రవాహాన్ని ఊహించారుగానీ, ఎందుకో ఈరోజు ఖాళీగా ఉంది. చెదిరిన జుట్టు సర్దుకుంటూ, దూరంగా నిలబడ్డ ఒంటరి రైలు ఇంజన్ని చూస్తుంది చిత్ర. సాయంకాలపు ఎండ, ఆమె ముఖంపై దిగులు రంగుల్ని పూసి, అనీజీగా ముఖానికి చెయ్యి అడ్డం పెట్టుకుంది. లౌడ్ స్పీకర్ లోంచి అమ్మాయి గొంతు రాబోతున్న ఒక ట్రెన్ గురించిన వివరాలు చెబుతుంది. కాఫీ తాగితే బాగుండుననుకుంది. కానీ ఏదో నిరాసక్తత. దేన్ని గురించీ ఆలోచించడానికి మనసు ఇష్టపడటంలేదు. గట్టిగా ఆవులిస్తూ, రెండు చేతుల్తో ముఖాన్ని రుద్దుకుంది. "తలనొప్పిగా ఉందా? కాఫీ తీసుకురానా?" అని అడగాలనుకున్నాడు శివ. కళ్ళు మూసుకుని, ధ్యానాన్ని నటిస్తున్న ఆమెను పలకరించడానికి ధైర్యం చాలలేదు.

"వచ్చే శనివారం నేను రానా?" అన్నాడు. ఆమె విన్నట్టులేదు. మరోసారి గట్టిగా ఆవులించి, తలను, అతని భుజంపై ఆన్చుకుని, కళ్ళు మూసుకుంది.

కళ్ళు మూసుకొనే "ఈనెల ఇరవై ఒకటి మన మారేజ్ డే. రెండేళ్ళు" అంది. రెండేళ్ళనాటి ఫిబ్రవరి ఇరవై ఒకటి. హైదరాబాద్. రాజేశ్వరి గార్డెన్స్. అదో అందమైన కల. అతనికెందుకో ఆరోజంటే చాలా ఇష్టం. "మనం, ఘనం గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోవాలి" అన్నాడు ఉత్సాహంగా.


చిత్ర చాలాసేపు మాట్లాడలేదు. "ఆరోజు వర్కింగ్ డే. సెలవు దొరకదు" అంది, యధాలాపంగా. చిత్ర వెళ్ళవలసిన ట్రెన్ ప్లాట్‌ఫాం పైకి వస్తున్నట్లు ఎనౌన్సు చేశారు. చిత్ర లేచి నిలబడింది. అంతగా బరువులేని బ్యాగ్‌ని భుజానికి తగిలించుకొని, ప్లాట్‌ఫాంపై నడవటం మొదలుపెట్టింది. శివ, ఏం మాట్లాడకుండా ఆమె వెంటనే నడిచాడు.

చిత్ర తన సీట్లో కూర్చుంది. బయట కిటికీ పక్కనే నిలబడ్డాడు శివ. "పోనీ ఉద్యోగం రిజైన్ చెయ్యి. ఇక్కడే హైదరాబాద్‌లో ఏదో ఒక జాబ్ చూసుకుందాం" అందామని అనుకొని, డెబ్బై వేల రూపాయల జీతం గుర్తుకొచ్చి ఆగిపోయాడు.

చిత్రకోసం కాఫీ తెచ్చాడు. పళ్ళు, మాగజైన్‌లు. ట్రెన్ బయలుదేరవలసిన టైం అయింది. చిత్రముఖంలో సన్నటి నవ్వు. "జాగ్రత్త" అంది, దిగులు, ప్రేమ నిండిన కళ్ళతో అతనివైపు చూస్తూ. చిత్ర, ఆ నవ్వు అతనికెంతో ఇష్టం. ప్రతివారం ఇదే రొటీన్. శని, ఆదివారాలు, సినిమాలు, పార్కులు, ఖరీదైన రెస్టారెంట్‌లు, ఆదివారం రెండు గుడ్ బైలు, చిత్రముఖంలో తళుక్కుమనే నవ్వు.

మళ్ళీ కలుసుకోబోయే శనివారం కోసం ఎదురు చూస్తుంటారు. సీరియల్ నవలలోలాగా. ప్రతి శనివారం ఉదయం, అతను స్టేషన్‌కు వస్తాడు. ఆ ఉదయం కోసం అతను ఎంతో ఎదురుచూస్తాడు. ఉత్సాహంలాంటిదేదో అతన్ని చుట్టుముడుతుంది. ప్రేమలాంటిదేదో తమ మధ్య ఉండి ఉండాలి, అని గట్టిగా నమ్ముతాడు, ఆదివారం సాయంకాలం ఆమెకు గుడ్‌బై చెబుతూ.

ట్రెన్ కదిలింది. ఆమెకు గుడ్ బై చెబుతూ, ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని, ఆమె అతని చేతిని మెత్తగా నొక్కి, అతని చేతిని, పెదాలకు అద్దుకుంది. ట్రెన్ అదృశ్యమయ్యేదాకా అక్కడే నిలబడ్డాడు శివ.



## 2

ఇది మార్చి నెల. పాలిపోయిన ఆకాశం. రోడ్డు పొడవునా మనుషులు. ప్రతిదీ జ్ఞాపకాలుగా, దృశ్యాలుగా, గుర్తుపట్టలేనట్లుగా మాసిపోయి. నిజానికి ఈ వారం శివ వాళ్ళ ఊరికి వెళదాం అనుకున్నారు. సోమవారం ఉగాది పండుగ. చిత్రకు సెలవు దొరకలేదు. ఉగాదినాడు కూడా హైదరాబాద్ రోడ్లపైనే గడపడానికి నిర్ణయించుకున్నారు.


"కృష్ణ నిన్ను అడిగాడు. ఆఫీసుకొచ్చి కలిశాడు. ఉద్యోగం ఏదైనా చూసిపెట్టమని అడిగాడు" అంది చిత్ర.

"కృష్ణ ఎవరు?"

ఎంతకీ గుర్తురాలేదు అతనికి. పొడవుగా, మెరిసే కళ్ళతో వాడేకదా? గుర్తొచ్చీ రానట్లుగా, ఇంకొకడున్నాడు. లావుగా, బండగా వాడి పేరేమిటి? ఎందుకిట్లా మరిచిపోతున్నాను, అనుకున్నాడు శివ.

నదిని దాటుతున్నట్లుగా, రోడ్లు దాటుతున్నారు వాళ్ళు.

టాంక్‌బండ్ మీదుగా, బషీర్ బాగ్ ఫ్లైఓవర్‌పై నుండి;



అతనికి చిన్నప్పటి జ్ఞాపకమేదో తళుక్కుమంది. వాళ్ళ ఊరు అంబేద్కర్ సెంటర్, ఓవర్‌బ్రిడ్జి, స్కూలు గేటు, కూలిపోయిన ప్రహరీగోడ, సున్నం వెయ్యని క్లాస్‌రూం గోడలు, విరిగిపోయిన చెక్కబల్లలన్నీ బయట కుప్పలుగా వేసి; గోడలపై పదునైన రాతితో గీసిన రాతలు వాటి కింద "ఇట్లు కృష్ణ", వాడేనా? తన పుస్తకాల మధ్యన బాగా నలిగిపోయిన ఒక ఉత్తరం. "నీకెన్నో ఉత్తరాలు రాశానురా. అందినాయా? నువ్వు వస్తావని ఎదురు చూస్తున్నానురా. మా తమ్ముడెప్పుడూ అడుగుతుంటాడు రా. బండశీనుగాడు గుర్తున్నాడా? వాడు ఎండ్రిన్ తాగి చచ్చిపోయాడురా. రోజులేం బాగులేవురా. చిన్నప్పుడు ఎంత బాగుండేది. సైన్స్ టీచరు సరోజిని..." శివ నిశ్శబ్దంగా మారిపోయాడు. కృష్ణ అనబడే వ్యక్తి ముఖం, విశాలమైన కళ్ళు, కళ్ళపై గుబురుగా పెరిగిన కనుబొమ్మలు గుర్తుకొచ్చాయి. కానీ అంతలోనే కృష్ణ అనే బొమ్మ మెదడులోంచి అదృశ్యం అవుతుంది. నింపిన గ్లాసును వెంటనే ఒలకబోసినట్లుగా.

అబిడ్స్ అనే మనుషుల సముద్రంలో చాలాసేపు తిరిగారు శివ, చిత్ర. బిగ్‌బజార్‌లో గంటసేపు గడిపారు, ఏమీ కొనకుండా. పుల్లారెడ్డి స్వీట్‌షాప్‌లో స్వీట్సు కొన్నారు. సముద్రాన్ని దాటినట్లుగా ఆ బజార్లను దాటి రవీంద్రభారతివైపు వెళ్ళారు. అంతసేపూ, కృష్ణ అనబడే స్నేహితుడి జ్ఞాపకాలు, ఒక్కొక్కటీ స్లైడ్‌షోలా శివకు గుర్తుకొస్తున్నాయి.ఆ జ్ఞాపకాలన్నీ అతడిలోపల ప్రవేశించి, లోపల శవాల గుట్టలు పోగుబడ్డట్టుగా అయి;

రవీంద్రభారతిలో మాజిక్ షో ఉంది. లోపలికి వెళ్ళాలా వద్దా అని ఆగేడు శివ. చిత్ర ఉత్సాహంగా లోపలికి నడిచింది. శివ, కుడిచేతి జబ్బపై చిన్నప్పుడు కట్టుకున్న తాయత్తు, బడిముందర గారడీవాడు, ఆట ప్రదర్శనిస్తున్నప్పుడు, ఈ కృష్ణనే కొనిపెట్టాడు. తాయత్తును చేతితో తడుముకున్నాడు.

మెజీషియన్‌కు పాతిక సంవత్సరాలు కూడా లేవు. ఇంగ్లీషులో మాట్లాడుతున్నాడు. చిన్న చిన్న ట్రిక్కులు చేసి, జనాన్ని చప్పట్లు కొట్టమని డిమాండ్ చేస్తున్నాడు.

"అల్లాఖజమ్, అల్లాఖజమ్" అంటూ పెద్దగా అరిచి, బుట్టలో ఒక గులాబీ పువ్వును పెట్టి, మూతవేసి, దానిపై గుడ్డను కప్పి, మంత్రదండాన్ని, దానిపై మూడుసార్లు తిప్పి, అందర్నీ చప్పట్లు కొట్టమని అడిగి; "ఇది చాలా ఓల్డు ట్రిక్కు" అంది చిత్ర. అవునన్నట్టుగా శివ తల ఊపాడు. "ఆ పువ్వు, కోతిగానో, కుందేలుగానో మారిపోతుంది. మా చిన్నప్పుడు గారడీవాడు ఇట్లాంటి ట్రిక్కులే చేసేవాడు" అన్నాడు. మెజీషియన్, జనం చప్పట్ల మధ్య బుట్టపైన గుడ్డను తీశాడు. బుట్టలోకి చేతులు పెట్టి, కుందేలును బయటకు తీశాడు. "దేవుడా!" అంటూ పెద్దగా అరిచింది చిత్ర. కుందేలు పిల్ల, తలతెగి, తల పక్క కు వాలి ఉంది. మెజీషియన్ చేతినిండా రక్తం. అతని ముఖం పాలిపోయింది. ఆడిటోరియంలో నిశ్శబ్దం. జనం నివ్వెరపోయి చూస్తున్నారు. శివ గుండెల్లో ప్రకంపనం, భయం. పారిపోతున్నట్లుగా బయటకు నడిచాడు. కృష్ణ అనే జ్ఞాపకాల్లోని మిత్రుడు, అతన్ని వెంటాడుతూ, అతని పక్కనే నడుస్తున్నట్లుగా ఉంది. వెనక్కు G.P.O. వైపు వెళ్ళి, కృష్ణ అనే స్నేహితుడికి, ఐదువేల రూపాయలు టి.యమ్.వో. చేశాడు. కృష్ణ అడ్రసు రాస్తుంటే, ఎందుకో అతని చేతులు వణికాయి. చిత్రకు ఈ తతంగం నచ్చలేదు. "అతడు నిన్ను డబ్బులెప్పుడు అడిగాడు" అంది. శివ ఏం మాట్లాడలేదు. చిత్ర ముఖం నల్లగా అయింది. ఎందుకో చిత్ర కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

## 3

మార్చి నెల. రాత్రి. అపార్టుమెంటులో వాళ్ళిద్దరూ వాదించుకొంటున్నారు. చిన్న విషయమే. గదినిండా ఎ.సి. తాలూకు చల్లని గాలి, తెరలు తెరలుగా, మంచు తుఫానులా ఉంది. వణికించే చలి. పైన వెచ్చటి రగ్గు, అతనికట్లా ఇష్టం. కర్టన్లన్నీ మూసి, డిమ్‌లైట్ కూడా ఆపివేసి నల్లనల్లనిదేదో పాకుతున్నట్లుగా, చిత్ర విసుక్కుంది. హారర్ సినిమాలో దృశ్యంగా, చీకటి, వణికించే చలి. "నాకిట్లా యిష్టం" అన్నాడు శివ "నాకిట్లా యిష్టం ఉండదు. లోయల్లోకి జారుతున్నట్లుగా ఉంటుంది" అంది చిత్ర. కాసేపటికి విషయం మారింది. వాళ్ళు మాటల్ని విసురుకోవటం ఆపలేదు. హైదరాబాద్ గురించి మాట్లాడుకున్నారు. "ఇక్కడెందుకు ఉంటానంటావు" అన్నాడు. ఆమె నివ్వెరపోయింది. బెంగుళూరులో ఆమె జీతం డెబ్బై వేలు. రెండేళ్ళలో ఎంత మిగుల్చుకోవచ్చో లెక్కలు వేసి చెప్పిందీ అతనే.

కాసేపు మాటల్లేవు. మంచంపై ఒక మూలకు జరిగి పడుకుంది. అద్దం తెల్లగా మెరుస్తుంది. నీలిరంగు కర్టెన్ అవతల నుంచి సన్నని వెలుతురు తళుక్కుమంటుంది. గదిలోని చప్పుళ్ళు అదృశ్యం అయినాయి. కాసేపయినాక, ఒక్కళ్ళకొకరు 'సారీ' చెప్పుకున్నారు. ఆ తరువాత మరేం మాట్లాడుకోలేదు. మాటలు అయిపోయి, వాళ్ళు పూర్తిగా ఖాళీ అయినట్లుగా. సన్నటి వెలుతురేదో పడి, తళుక్కుమంటున్న ఆమె ముఖాన్ని దీక్షగా చూశాడు. పాలిపోయి, ఆభరణాలన్నీ వలిచివెయ్యబడ్డ దేవతలా ఉంది. చాలాసేపు గడిచింది. దీపాలు ఆరిపోయే ఉన్నాయి. అంత చీకట్లోనూ, అతను ఆమెను చూడగలుగుతున్నాడు. ఎత్తయిన గుండెలు, సన్నటి నడుము. చాలాసేపు అతనిలో సంచలనం. అలలు అలలుగా, అతని శ్వాస. అతనికి ఎప్పుడో చూసిన పర్వతశ్రేణులు గుర్తుకొచ్చాయి. పూలతోటలతో నిండిన మైదానాలు గుర్తుకొచ్చాయి. కలలాంటిదేదో అతన్ని కమ్ముకుంది. నిద్రలో ఆమె అతనివైపుకు తిరిగింది. ఆమె శ్వాస వెచ్చగా అతనికి తగులుతూ. ఆమెకు క్షణంపాటు మెలకువవచ్చి, అతని వైపుకు జరిగి, చేతుల్ని అతనిపై వేసి, ముద్దు పెట్టుకొని, మళ్ళీ పక్కకు జరిగింది.

అతడు మెల్లగా ఆమె వైపు తిరిగాడు. మృదువైన ఆమె చెంపలను నిమిరాడు. ముందుకు వంగి, ఆమె పెదాల్ని ముట్టుకున్నాడు. చాలా సేపు అట్లాగే - ఎందుకో అతనికి దుఃఖం వేసింది.

## 4

ఏప్రిల్ నెల. చూస్తుండగానే శనివారం వచ్చేసింది. చిత్ర వచ్చే రోజు. స్టేషన్‌కు రాలేనని SMS పంపాడు. గాలి తెరలలోంచి, ఉదయపు వాసనలు వస్తున్న సమయంలో, చిత్ర, తలుపు తెరచుకొని, ఇంట్లోకి అడుగుపెట్టింది. రూమ్ జబ్బుచేసిన మనిషిలా కనబడింది. చానాళ్ళు జ్వరంపడ్డ శరీరంలోంచి వస్తున్న వాసన.

*రవీంద్రభారతిలో మాజిక్ షో ఉంది. లోపలికి వెళ్ళాలా వద్దా అని ఆగేడు శివ. చిత్ర ఉత్సాహంగా లోపలికి నడిచింది. శివ, కుడిచేతి జబ్బపై చిన్నప్పుడు కట్టుకున్న తాయత్తు, బడిముందర గారడీవాడు, ఆట ప్రదర్శనిస్తున్నప్పుడు, ఈ కృష్ణనే కొనిపెట్టాడు. తాయత్తును చేతితో తడుముకున్నాడు.*

మెల్లగా చేతుల్ని ముందుకు సాచి, అతన్ని గట్టిగా హత్తుకుంది. అంతలోనే ఆ చేతుల్ని వదిలేసింది. వాళ్ళ శరీరాల్లో ఆమె ఊహించిన విద్యుత్తు ఏదీ వెలగలేదు. శరీరంలోని ప్రాణశక్తి ఏదో చచ్చిపోయినట్లుగా. రోడ్డుపై గుట్టలుగా పోగుపడిన కార్లు, మేడలు, సమస్తం, జీవరహితంగా అనిపించసాగాయి. మాంత్రికుడెవరో, సమస్తాన్ని బొమ్మలుగా మార్చివేసినట్లు.



చిత్ర గాఢంగా నిట్టూర్చింది. రూమ్‌ని మామూలు స్థితికి తేవాలంటే కనీసం రెండు రోజులు పడుతుంది. ఎనిమిది గంటలకు 'అపోలో' హాస్పటల్‌లో అపాయింట్‌మెంటు ఉంది చిత్రకు. (చెవి సమస్య. ఎడమ చెవి సరిగ్గా వినబడటం లేదని. రెండు మూడుసార్లు బెంగుళూరులో చూపిస్తే, చాలా టెస్టులు చేసి, ఏమీలేదు, సైకలాజికల్ ఫీలింగ్ అని తేల్చారు. ఏదో తీవ్రమైన జబ్బేమో అని చిత్ర అనుమానం. క్రమంగా శబ్దాలు వినే శక్తిని పోగొట్టుకుంటానని చిత్ర భయం).

ఏడున్నరకు ఇద్దరూ రోడ్డుపైకి వచ్చారు. రోడ్డు ఖాళీగా ఉంది. పేవ్‌మెంట్‌పై కువకువలాడుతున్న పావురాలు. టెన్నిస్ రాకెట్ తగిలించుకొని, మోపెడ్‌పై వెళుతున్న అమ్మాయి. స్కూలు పిల్లల బస్సు వాళ్ళ ముందునించి వెళ్ళింది. బస్సులోంచి పిల్లలు చేతులు ఊపుతూ, బస్సు వందలాది పూలతో చేసిన బొకేలా ఉంది.

ఉదయం ఆహ్లాదకరంగా ఉండటము నిజమేనేమో కాని, ఇదంతా ఒట్టి ఇల్యూజన్ అని, అతని నమ్మకం. ఏ క్షణంలోనైనా, ఈ సన్నివేశం మొత్తం భరింపలేని దృశ్యంగా మారిపోవచ్చని అతని అంచనా.

ఇది ఎనిమిదోసారి, చిత్రతో కలిసి హాస్పిటల్‌కు రావటం. హాస్పిటల్ విలాసపురుషుని కలలా ఉంది. హాస్పటల్‌లో అడుగుపెట్టగానే, అతనికి వాన వాసన వేసింది. (పోనీ దిగులు వాసనా) చిత్రపరీక్షల కోసం లోపలికి వెళ్ళింది. అతను కేఫ్టేరియాకు వచ్చాడు. కోక్ తాగాడు. సిగిరెట్ కాల్చాడు. పైనాపిల్ కేక్ తెచ్చుకున్నాడు. కేక్ తింటుండగా, చిత్ర ఏమీ తినలేదని గుర్తుకొచ్చింది. కేక్ అట్లాగే వదిలేశాడు. కేఫ్టీరియా కూడా జబ్బు వాసన వేస్తుంది. కాఫీ కోసం, అప్పుడప్పుడు వస్తున్న నర్సుల వైపు ఎరోటిక్‌గా చూస్తూ. పదిన్నరకు చిత్ర వచ్చింది. ప్లాస్టిక్ సంచినిండా మందులు. చిత్ర కాఫీ తెచ్చుకుంది.

"ఏమన్నారు" "పరీక్షలన్నీ నార్మల్‌గానే ఉన్నాయన్నారు" అంది నిట్టూరుస్తూ. టేబుల్‌పై, కోక్ బాటిల్, ఖాళీ ఐస్‌క్రీమ్ కప్, సగం తిని వదిలేసిన కేక్, ఉండలు చుట్టి విసిరేసిన నాప్‌కిన్‌లు, "చాలా రోజులుగా నిలవ ఉన్న ఆహారపదార్థంలా ఉన్నావు" అంది, సీరియస్‌గా, అతనివైపు చూస్తూ. కాసేపాగి "ఏ హాస్పిటల్‌కు వెళ్ళినా ఇదే చెబుతున్నారు" అంది దిగులుగా. "నిజంగా ఏమీ వినబడదా నీకు" అన్నాడు సందేహంగా. "మామూలుగా వినిపిస్తుంది. కానీ, ఎప్పుడన్నా, షడన్‌గా, చప్పుళ్ళన్నీ ఆగిపోతాయి. చెవుల్లో సముద్రం ఏదో ప్రవహిస్తున్నట్లు, ఒకటే హోరు" అంది. "నిజంగా వినబడదా?" అన్నాడు మళ్ళీ. కోపం లాంటి, విసుగులాంటి ఒక చూపు అతనివైపు చూసింది. ఇద్దరూ బయటకు నడిచాడు. హాస్పటల్ మెట్లపై కూర్చుని తొమ్మిదేళ్ళ పాప వెక్కి వెక్కి ఏడుస్తుంది. తల్లికాబోలు, ఆ పాప జుట్టు నిమురుతూ, ఓదార్చుతూ. "ఆ అమ్మాయికి కేన్సరేమో" అన్నాడు శివ హఠాత్తుగా. "ఛీ, అది నోరేనా, ఎందుకట్లా అపశకునాలు వాగుతావు" విసుక్కుంది చిత్ర.

మోటారు సైకిల్‌పై కూర్చున్నాక స్టార్టు చేస్తూ, ఆమె చేతిని, తన చేతిలోకి తీసికొని "ఆర్ యూ, ఆల్‌రైట్" అన్నాడు. చిత్ర ఏమీ మాట్లాడలేదు. రోడ్డువైపుకు చూస్తూంది. శివ, హిందీ సినిమా పాట ఏదో హమ్ చేస్తున్నాడు. చిత్రకు, ఆ పాట, చెవుల వరకూ వచ్చి, ఆగిపోతున్నట్లుగా అనిపించసాగింది. దిగులుగా, అతని భుజంపై తలవాల్చి పడుకుంది. అతనేదో చెబుతున్నాడు. ప్రేమగా, అనునయంగా. ఆమెకేమీ వినిపించటంలేదు.

## 5

మే నెల. వేసవి ఎండలు. ప్లాట్‌ఫాం చప్పుళ్ళతో నిండిపోయింది. ప్లాట్‌ఫాం నిండా మనుషులు, మాటలు, నవ్వులు, అరుపులు; లౌడ్ స్పీకర్‌లోంచి అమ్మాయి గొంతు. ఉదయపు ఎండ శరీరంపై సూదుల్ని పొడిచినట్లుగా. చిత్రకు అలసటగా ఉంది. విసుగ్గా ఉంది. చెమట చెమటగా ఉంది. ఏదైనా రెస్టారెంట్‌లో కాసేపు కూర్చుందాం అంది. 'ఆల్ఫా' లో కూర్చున్నారు వాళ్ళిద్దరు. టీ తెప్పించుకున్నారు.

పక్కనే ఉన్న మెష్‌పై నాలుగైదు పావురాలు. ఇన్ని లక్షల మంది జనం మధ్య, ఆ నాలుగు పావురాలు, చిట్టచివరి ఆశల్లాగా. వాళ్ళకెదురుగా ముప్పయియేళ్ళ ఆడమనిషి కూర్చుని ఉంది. పదేపదే కళ్ళు తుడుచుకుంటూ, ఆమె వైపునుంచి సన్నని రోదన ఎగిసివస్తుంది. ఆమె పక్కనే ఆరేళ్ళ ఆమె కొడుకు, ఉత్సాహంగా రోడ్డు వైపు చూస్తూ. కాసేపటికి, గెడ్డం మాసిపోయి, పాలిపోయిన ముఖంతో ఉన్న మగవాడు, వాళ్ళ దగ్గరకు వచ్చేడు. కుర్రవాణ్ణి దగ్గరకు తీసుకొనే లోపలే, తాగుతున్న టీ కప్పును, బలంగా అతని ముఖంపైకి విసిరింది. కప్పు పగలి, అతని నుదురు సన్నగా చీలి, ఆమె పెద్దగా ఏడవటం మొదలుపెట్టింది. హోటల్ సర్వర్లు, చాలామంది మనుషులు వాళ్ళచుట్టూ మూగారు. శివకు అనీజీగా ఉంది. ఆ సన్నివేశంలో ఉండటం ఇష్టంగాలేదు. చిత్రను బయటకు లాక్కువచ్చాడు. మోటారు సైకిలు స్టార్టు చేశాడు గానీ, ఎందుకో చేతులు వణుకుతున్నాయి. హేండిల్ బిగుసుకుపోయి, బాలెన్స్ కుదరక, డ్రైవింగ్ బాధాకరమైన అనుభవంలా ఉంది. హోటల్‌లోని దృశ్యం, అతనికెందుకు అనీజీగా అనిపిస్తుందో, అతనికి అర్థం కాలేదు. ఎదురైన అపశకునం ఇది అనుకున్నాడు.

చిత్ర హేండ్‌బాగ్‌లో, అతని కోసం కొన్న గ్రీటింగ్. పగటి ఎండ పడి, మిలమిలలాడుతున్న నది ఫోటో అది. ఒక ఫోటో ఎగ్జిబిషన్‌లో కొన్నది.

రోడ్డుపై దృశ్యాలు మారుతున్నాయి. అమీర్‌పేట చౌరస్తాలో అప్పుడే ట్రాఫిక్ జామ్ మొదలైంది. వందలాదిలా ఆటోలు. బస్‌స్టాపుల్లో ఎదురుచూపులు చూస్తున్న జనం. విలాసవంతమైన జీవితానికి ఆహ్వానాల్లా ఉన్న హోర్డింగ్‌లు.

"నువ్వు పంపిన ఇ-మెయిల్ అందింది. ఇట్స్ ఫన్నీ. ఐ ఎంజాయ్ ఇట్" అంది చిత్ర ఏదో గుర్తుకొచ్చినట్లుగా. "ఆ ఒక్కరోజూ యాభై మెయిల్స్ పంపాను. ఆరోజు ఎందుకో హుషారుగా అనిపించింది. అందరికీ మెసేజ్‌లు పంపాను. రాత్రి రెండుదాక ఛాటింగ్ చేశాను" అన్నాడు శివ ఉత్సాహంగా.

చిత్ర, శివ పంపిన మెయిల్ గురించి ఆలోచిస్తుంది. సుదీర్ఘమైన మెయిల్. మెయిల్ మధ్యలో చాలా పోస్టుకార్డులు. ఇద్దరు కలిసి తిరిగిన ప్రదేశాల ఫొటోలు. ఆ ప్రదేశాలన్నీ ఆమె ఎప్పుడో మరిచిపోయింది. ఊటీ సరస్సు. మైసూరు పాలెస్, బెంగుళూరు ఫ్లవర్ గార్డెన్, ఎప్పుడో పారేసుకున్న వస్తువుల్ని తిరిగి అందజేసినట్లు. రెండేళ్ళు కూడా  కాలేదు. కానీ చాలా యేళ్ళ క్రితం జరిగిన విషయాల్లాగా ఉన్నాయి. ముందుకు వంగి, శివ ముఖంవైపు చూసింది. అతని ముఖం ఖాళీగా ఉంది. మెయిల్ పంపిన శివ ఇతను కానట్టుగా. బైక్‌పై, తన ముందు కూర్చున్న మనిషి, అపరిచితుడిలా.

మెల్లగా చేతుల్ని ముందుకు సాచి, అతన్ని గట్టిగా హత్తుకుంది. అంతలోనే ఆ చేతుల్ని వదిలేసింది. వాళ్ళ శరీరాల్లో ఆమె ఊహించిన విద్యుత్తు ఏదీ వెలగలేదు. శరీరంలోని ప్రాణశక్తి ఏదో చచ్చిపోయినట్లుగా. రోడ్డుపై గుట్టలుగా పోగుపడిన కార్లు, మేడలు, సమస్తం, జీవరహితంగా అనిపించసాగాయి. మాంత్రికుడెవరో, సమస్తాన్ని బొమ్మలుగా మార్చివేసినట్లు.

ఫ్లవర్ బొకే షాపులదగ్గర ఆపి, "పూలు కొనివ్వు" అని అడిగింది.

శివ, బండి ఆపి, చాలాసేపు షాపులన్నీ వెతికాడు. పూల బొకేలన్నీ ఎవరో ముందుగా ఆర్డర్ ఇచ్చినవే. చివరకు డ్రై ఫ్లవర్ బొకే తీసుకొచ్చాడు.

చిత్ర దిగులుపడింది.

'ఆఖరికి పూలు కూడా పోయినవేనా' అనుకుంది.

## 6

జూన్ నెల. వర్షాలకోసం ఎదురుచూసి, ఎదురుచూసి, వాతావరణం గాఢమైన వేడి నిట్టూర్పులా మిగిలింది. చిత్ర తన డైరీలో ఈ మధ్య కాలంలో చనిపోయిన (తనకు సన్నిహితులైన) వాళ్ళ వివరాలు రాసుకోవటం మొదలుపెట్టింది. ఒక దిగులుగా ఉన్నరోజు, ఏమీ తోచక, డైరీ తీసి, ఆరోజు ఉదయం యాక్సిడెంట్‌లో చనిపోయిన ఇన్ఫోసిస్ కుర్రవాడి గురించి రాయటం మొదలుపెట్టింది. క్రమంగా, చనిపోయినవాళ్ళ గురించి రికార్డు చెయ్యటం ఒక వ్యసనంగా మారింది చిత్రకు.

సన్నటి జల్లుపడి, వాతావరణం కాస్త ఆహ్లాదకరంగా ఉందని ఉత్సాహపడుతున్న చిత్రకు, తన కొలీగ్ మాలిని అపార్ట్‌మెంటు పై నుంచి దూకేసిందన్న వార్త, షాక్ చేసింది. ఊపిరాడనట్లు కాసేపు ఆయాసపడింది. శబ్దాలు వినబడని జబ్బు, రెండవ చెవికి కూడా వచ్చింది. భరించలేని నిశ్శబ్దం. పెద్దగా ఏడిస్తే బాగుండు అనిపించింది గానీ, ఎందుకో ఏడుపురాలేదు. డైరీ తీసుకొని, మాలిని గురించి రాయటం మొదలుపెట్టింది. మాలిని, ఐటియన్, C-DOT లో గ్రూప్ మేనేజర్, ఆరో నెల ప్రెగ్నెన్సీ. బయోడేటా రాసినట్లుగా, మాలిని, వయసు ఇరవై నాలుగు, ఎత్తు- మాలినితో తన పరిచయం, స్నేహం అవేమీ గుర్తు తెచ్చుకోవాలనిపించలేదు. డైరీలో మాలిని వివరాలు, అడ్రస్‌లు మాత్రం రాసింది. ఆరోజు ఆఫీసు మానేసింది. ఆ సాయంకాలం, మాలిని క్రిమేషన్‌కు రమ్మని కబురుచేసినా, రూము దాటిపోలేదు.

ఆ మరుసటిరోజు నుంచి, రెండు పేపర్లు తెచ్చుకోవటం మొదలుపెట్టింది. ఒక తెలుగు పేపర్ కూడా. పేపరంతా వెతికి, చనిపోయిన అమ్మాయిల వివరాలు డైరీలో రాసుకోవటం, ఒక హాబీగా మార్చుకొంది.

ఇవాళ గురువారం. శుక్రవారం సాయంత్రానికి రిజర్వేషన్ చేయించుకొంది. రేపటి ప్రయాణం గురించి ఆలోచిస్తే, కాస్త హుషారుగా అనిపించింది. ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ బిగ్ బజారుకెళ్ళింది. రెండు మూడు గంటల పాటు లోపలంతా తిరిగి, రెండు ప్లాస్టిక్ గాజులు, శివకోసం షర్టు కొనుక్కుంది. మాల్‌లో ఇద్దరు కుర్రవాళ్ళు తన వెంట నడవటం గమనించింది. తన చూపులో పడాలని, పక్కపక్కనే నడుస్తూ.


బయటకు వచ్చి, ఆటోలో కూర్చున్నాక, వాళ్ళిద్దరూ బైక్‌పై తన వెనకే రావటం గమనించింది. ఆటో దాటి, ముందుకు వెళ్ళి వెనక నుంచి చేతులు ఊపుతూ, 'హాయ్' అంటూ ఫ్లైయింగ్ కిస్‌లు ఇస్తూ, చిత్రకు, ఎందుకో కోపం రాలేదు. మునుపటిలాగా ఇరిటేషన్ కలగలేదు. చిత్రకు వాళ్ళను ఆపి మాట్లాడాలనిపించింది. ఉర్రూత లూగించే విషయం, ఈ చిత్రలో లేదని చెప్పాలనిపించింది. కంప్యూటర్ ముందు కూర్చుని, కూర్చుని, ఈ చిత్ర అవయవాల పోగులా మిగిలిపోయిందని, చెప్పాలనిపించింది.

చిత్ర తన గదికి వచ్చేసరికి, బాగా పొద్దుపోయింది. మిగిలిన గదుల్లోంచి, టీవీ సీరియళ్ళు, డైలాగులు వినిపిస్తున్నాయి. తన గదిలోకి వచ్చి, తలుపులు మూసేసుకుంది. కిటికీ తీసి, రోడ్డుపైకి చూస్తే, ఒక మూలన, స్ట్రీట్‌లైట్ కింద, బైక్ ఆపుకొని, ఆ ఇద్దరు కుర్రవాళ్ళు, తన గదివైపే చూస్తూ.

చిత్రకు ఎందుకో, చాలా రోజుల తరువాత, నవ్వు వచ్చింది. విరక్తిగా మొదలైన నవ్వు క్రమంగా, ఆహ్లాదకరమైన నవ్వుగా మారింది. చాలాసేపు నవ్వుకున్నాక, ఆ రాత్రిలో కాస్త ఉత్సాహం, హుషారు మొలకెత్తాయి.

అదే సమయంలో, హైదరాబాద్‌లో, అంత రాత్రిపూట కూడా, ఇంకా సజీవంగా ఉన్న నగరంలో, శివ తన లాప్‌టాప్ ముందు కూర్చున్నాడు. మరో పోర్నోగ్రాఫిక్ బొమ్మ, అతని ఇ-మెయిల్‌లో వచ్చింది. నటాషా అనే అమ్మాయి పేరుతో పంపిన మెయిల్ అది. "Welcome, into the sea of unbound sex" అని అంది. మెయిల్ కింద ఒక అపార్టుమెంటు అడ్రస్ కూడా ఉంది. శివ గుండెలో చిన్న జలదరింత. బయట సన్నని వాన తుంపర. వేసవికాలం వెళ్ళిపోయిందని, వాతావరణం, కొత్త హుషారును ప్రదర్శిస్తుంది. టేబుల్‌పై ఆహారపదార్థాలు అలాగే ఉన్నాయి. అతనికి విస్కీ తాగాలనిపించింది. బాల్కనీలో నిలబడి, బయట రోడ్డుపై వెళ్ళే వాహనాలను చూస్తూ, విస్కీ సిప్ చేస్తూ, చిత్రను గుర్తు చేసుకున్నాడు. చిత్రకు బదులుగా, స్తనాలపై చేతులుమాత్రం అడ్డుగా పెట్టుకొని నిల్చున్న నటాషా కళ్ళముందు ప్రత్యక్షమైంది. చాలా రోజులుగా ఆ అమ్మాయి మెయిల్స్ వస్తున్నాయి. ఆ అమ్మాయి ఎవరై ఉంటుందని ఆలోచించాడు. కొలీగ్స్‌లో ఒక్కొక్కరినీ గుర్తు చేసుకున్నాడు. తను ఉండే అపార్టుమెంటులో ఉన్న నలుగురు సాఫ్ట్‌వేర్ అమ్మాయిలు గుర్తుకొచ్చారు. అసహనంగా కదిలాడు. విస్కీ తాగడం పూర్తి అయింది. మరోసారి ఇ-మెయిల్ చూసుకున్నాడు. ఆ అమ్మాయి శరీరంలోంచి నిప్పుల సెగ ఏదో ఎగిసి, అతన్ని వెచ్చగా ఆవహించినట్లు అనిపించింది. లేచి, డ్రస్ చేసుకొని, పర్సులో చాలా డబ్బులు కుక్కుకొని, రోడ్డుపైకి వచ్చాడు. రోడ్డుపై వెళుతుంటే సన్నని పరిమళమేదో తెరలు తెరలుగా ప్రవహిస్తున్నట్లు అనిపించింది. ఇ-మెయిల్‌లో ఇచ్చిన అడ్రస్ దగ్గర ఆగాడు. ఆ పేరుగల అపార్ట్‌మెంటు లేదు. ఆ ప్రదేశంలో, కార్పోరేషన్ వాళ్ళు, ఈ మధ్యనే కూల్చివేసిన మేడల శిథిలాలు ఉన్నాయి. అసహనంగా, దిగులుగా, కోపంగా. అతనిలో కాంక్షాజ్వాల ఆరలేదు. కొద్దిగా చనువు, చాలా పరిచయం ఉన్న కొల్లీగ్ ఇంటివైపు వెళ్ళాడు. ఆ అమ్మాయి ఒక్కతే తల్లితో పాటు ఉంటుంది. బెల్లుకొట్టాడు. ఆ అమ్మాయి ఆశ్చర్యపోయింది. "రా, శివా, ఇంత రాత్రివేళ" అంటూ లోపలికి పిలిచింది. గదిలోకి వస్తూనే, సోఫాలపై ఉన్న పుస్తకాల గుట్టల్ని చూసి ఆశ్చర్యపోయాడు. పక్కనున్న కబోర్డులోనూ పుస్తకాలే. అది ఇల్లులాకాదు, బుక్‌ఫెయిర్‌లా ఉంది. ఆ అమ్మాయి(సుమ) కాఫీ తెచ్చి యిచ్చింది. అతి మామూలు, రొటీన్ కబుర్లు చెప్పుకోవటం మొదలుపెట్టారు వాళ్ళు. గోడపైన ఒక ఫోటో (నిలువెత్తుది) కనబడింది. ఇద్దరు అందమైన యువ దంపతులు. "అమ్మా నాన్నలది, వాళ్ళ పెళ్ళినాటిది" అంటూ వివరించింది. ఫోటోలోని అమ్మాయి నిండయిన పట్టుచీర కట్టింది. యువకుడు సూట్ వేసుకున్నాడు. ఫోటోలోని అమ్మాయి మనోహరంగా ఉంది. ఆమె జడలోని మల్లెల గుత్తులు, ఫోటోలోంచి స్పష్టంగా కనిపిస్తూ, ఇప్పటికీ పరిమళిస్తున్నట్లుగా అనిపించసాగాయి. గంట తరువాత వెళతానని లేచాడు. పక్క గదిలోంచి, బాధతో వేసిన మూలుగు వినిపించింది. "అమ్మ" అని చెప్పింది. కర్టెన్‌లోంచి లోపలికి తొంగి చూశాడు. ఎముకల పోగులాంటి మనిషి, మంచంపై ముడుక్కొని పడుకొని, చిన్న అవయవాల గుట్టలా ఉంది.

ఆ అమ్మాయికి గుడ్ బై చెప్పి రోడ్డుపై కొచ్చాడు. బయట ఆకాశం కొంటెగా ఉంది. చంద్రుడు



అతనికి విస్కీ తాగాలనిపించింది. బాల్కనీలో నిలబడి, బయట రోడ్డుపై వెళ్ళే వాహనాలను చూస్తూ, విస్కీ సిప్ చేస్తూ, చిత్రను గుర్తు చేసుకున్నాడు. చిత్రకు బదులుగా, స్తనాలపై చేతులుమాత్రం అడ్డుగా పెట్టుకొని నిల్చున్న నటాషా కళ్ళముందు ప్రత్యక్షమైంది. చాలా రోజులుగా ఆ అమ్మాయి మెయిల్స్ వస్తున్నాయి. ఆ అమ్మాయి ఎవరై ఉంటుందని ఆలోచించాడు.

మృదువుగా ఉన్నాడు. పేవ్‌మెంటుపై రాలిన ఆకులు, చప్పుడు చేస్తూ గాలిలో ఎగురుతున్నాయి. గదిలోకి వెళ్ళగానే గాఢమైన చీకటి అతన్ని చుట్టుముట్టింది. లైట్ వెయ్యకుండానే మంచంపై వాలిపొయ్యాడు. అతనికి మాస్టర్బేషన్ చేసుకోవాలనిపించింది. బయట బాల్కనీ అవతల, కొత్త రుతువుల తొలిగాలులు బయ్యి బయ్యిమని వీస్తున్నాయి.

## 7

జూలై నెల. వర్షాలు మొదలయినాయి. శివ స్టేషన్‌కు రాలేదు. పెద్ద వర్షమేమీ లేదు. సన్నటి జల్లు. సన్నటిజల్లు చిత్రలో ఉత్సాహాన్ని రగిలించింది. శివ ఇంకా నిద్రపోతున్నాడు. ఇల్లంతా సర్ది ఉంది. కాఫీ పెట్టుకొని బాల్కనీలో నిలబడి, కాఫీ తాగుతూ. కాఫీ తాగుతుంటే, లోలోపల వెచ్చని జ్ఞాపకమేదో మేలుకుంటున్నట్టు. శివని లేపి ఏదైనా కబుర్లు చెప్పాలనిపించింది. ముఖ్యంగా నిన్న సాయంత్రం గైనకాలజిస్టును కలిసి వచ్చిన సంగతి. అపార్టుమెంటు కిందనున్న ప్రొవిజన్స్ స్టోరుకు వెళ్ళింది. రెండు కాడ్‌బరీస్ చాక్లెట్లు తీసుకొంది. అరకిలో చికెన్ తీసుకుంది. ఫ్లవర్ పాయింట్‌కెళ్ళి, తెల్లగా మెరుస్తున్న పూలబొకే నొకదాన్ని తీసుకొంది.

నిద్రలో చిత్రకు వింత కల వచ్చింది. ప్రశాంతంగా, ఏ దుఃఖం లేనట్లుగా ఉన్న శిశువు కల అది. శిశువు నిర్వాణ మూర్తిలా, ఏ కదలిక లేని ముఖంతో, శిశువుకు కళ్ళు, నోరు, చెవులు ఏవీ లేవు. నున్నటి, గుండ్రటి ముఖం. చిత్రకు భయం వేసింది. పెద్దగా అరవాలనిపించింది. హఠాత్తుగా శిశువు శిరస్సు వందల ముక్కలుగా చిట్లిపోయి, ముఖమంతా రక్తం చారలై...



శివ ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. నిద్రలేపాలని చూసింది. గాఢనిద్రలో ఉన్నాడు. అనుమానమొచ్చి దగ్గరకు వెళ్ళి వాసన చూసింది. రాత్రి బార్‌కెళ్ళినట్లున్నాడు. మౌనంగా అతని మంచం పక్కన కూర్చుంది. అతని కుడిభుజంపై ఆకుపచ్చరంగు మచ్చ. టాటూ. గులాబీ పువ్వు బొమ్మ. ఆ బొమ్మని మృదువుగా నిమిరింది.

వంటగదికి వెళ్ళి బ్రెడ్, ఆమ్లెట్ వేసింది. వాన జల్లు ఆగిపోయి, తడిసిన జల్లులపై ఎండ మిలమిలలు తళుక్కుమంటున్నాయి. చాలాసేపు బాల్కనీలో నిలబడింది. లోపలికి వచ్చేసరికి శివ మంచంపై లేడు. బాత్‌రూమ్‌లో కూడా లేడు. అలా చెప్పకుండా బయటకు వెళ్ళినందుకు దిగులు వేసింది. ఫ్రిజ్‌లో ఎర్రటి లిచ్చీపండ్లు కనబడ్డాయి. అవి తెచ్చుకొని, వలుచుకొని తినసాగింది. రోడ్డుపై కార్ల ప్రవాహం మొదలైంది. అపార్ట్‌మెంటు గేటు దగ్గర శివ కనపడ్డాడు. చేతిలో పేపర్లు ఉన్నాయి. సెలవు రోజు నాలుగైదు పేపర్లు చదవటం అతనికిష్టం. లిచ్చీపండ్లు తీయగా, పుల్లగా, నాలుకపై ఏదో అజ్ఞాతమైన పులకరింతల్ని గుర్తు చేస్తున్నాయి. కాలేజీ రోజుల్లో యిష్టపడ్డ ఒక కుర్రాడు గుర్తుకొచ్చాడు. ఎర్రటిజుట్టు. కలువల్లాంటి వెడల్పాటి కళ్ళు. అతని ముఖంలో వింత వెలుగు కనబడేది. క్లాసులో అతను మాట్లాడుతుంటే, ఆరాధనగా చూసేది. అతను మాట్లాడుతుంటే పక్షుల రెక్కల చప్పుడు వినిపించేది. చాలారోజులు అతని గురించిన కలలు వచ్చేవి. అతని చేతివేళ్ళు, ఆమె పెదవులపై, చెక్కిళ్ళపై పారాడుతున్నట్లు, ఉలిక్కిపడి నిద్రలేచేది. ఆ కలలు, అట్లాగే, ఆమెలో మొలకెత్తని విత్తనాల్లా ఉండేవి. ఏమి చెయ్యాలో అర్థమయ్యేది కాదు. అతను ఏమయ్యాడో కూడా తెలియదు. అప్పటి కలలు ఇంకా ఆమెకు గుర్తుకొస్తుంటాయి.

గదిలోకి వెళ్ళి, ఉల్లిపాయలు, టమోటాలు తరగటం మొదలుపెట్టింది. శివ వంట గదిలోకి తొంగిచూసి, పేపర్ తీసుకొని టాయ్‌లెట్‌లోకి వెళ్ళాడు. చిత్ర తరిగిన టమోటాలు గిన్నెలో వేసుకొని, ఫ్రిజ్‌లోంచి, చికెన్ బయటకు తీసింది. పక్క అపార్టుమెంటులోంచి పిల్లల అరుపులు పెద్దగా వినిపిస్తున్నాయి. శివ బెడ్‌పై పడుకొని సీలింగ్ వైపు చూస్తున్నాడు. కళ్ళు మూసుకొని ఉన్నాడు. చిత్ర చాక్‌లెట్ తీసుకొచ్చింది. అతన్ని లేపి ఇవ్వాలని చూసింది. రెండు నిముషాలు మంచంపై కూర్చుని, చాక్‌లెట్ మంచంపై పెట్టి మళ్ళీ వంటగదిలోకి వచ్చింది.

చిత్రకు, హఠాత్తుగా కాలేజీ రోజులనాటి, ఆ కుర్రవాడు గుర్తుకొచ్చాడు. పదే పదే అతన్ని గుర్తు చేసుకోవాలనిపించింది. శివ లేచి, బ్రష్ చేసుకుంటూ, తన జర్మనీ ట్రిప్ గురించి మాట్లాడటం మొదలుపెట్టాడు. నెలరోజులపాటు జర్మనీలో ట్రైనింగ్ అని చెప్పాడు. 'థ్యాంక్ ఫర్ ది చాక్‌లెట్' అన్నాడుగానీ, ఎందుకు యిచ్చిందో అడగలేదు. బ్రెడ్, ఆమ్లెట్ తెచ్చింది. ఇద్దరూ చాలా సీరియస్‌గా, బ్రేక్‌ఫాస్ట్ చెయ్యటం మొదలుపెట్టారు. "చికెన్ ఫ్రై చెయ్యి ఎప్పుడూ రుచి లేనట్లు ఉంటుంది ఆ కూర". 'ఊ' అంది. చాక్‌లెట్ రేపర్ విప్పి, చాక్‌లెట్ తినటం మొదలుపెట్టాడు. అతన్నే చూస్తూ కూర్చుంది చిత్ర. లేచి, కిటికీ దగ్గరకు వెళ్ళింది. రోడ్డుపై కారు ఆపుకొని, ఒక కుర్రవాడు, ఎవరికోసమో ఎదురుచూస్తున్నాడు. బస్సు ఒకటి, కిక్కిరిసిన మనుషులతో వెళుతుంది. అప్రయత్నంగా, ఆ బస్సు వైపు చేయి ఊపింది, చిత్ర.

వంట గదిలోకి వెళ్ళి, చికెన్‌ను సన్న ముక్కలుగా కోయటం మొదలుపెట్టింది. శివ నీలీ రేడియో ఆన్ చేశాడు. అందులో వినిపించే మాటల్లోని నాటీనెస్‌ను ఆనందించడానికి ప్రయత్నిస్తున్నాడు. బయట నల్లని మబ్బు ముసిరింది. కుండపోతగా వర్షమేదో కురవబోతున్నట్లుగా ఉంది. చిత్రకు మళ్ళీ కాలేజీ రోజులనాటి కుర్రవాడు గుర్తుకొచ్చాడు. అతని జుట్టు డై వేసినట్లుగా ఎర్రగా ఉండేది. అప్పట్లో అదో ఫ్యాషన్.

పక్కింటివాళ్ళ ఆల్సేషన్ డాగ్, చప్పుడులేని అడుగులతో బాల్కనీలోకి వచ్చి, ఠీవిగా నిలబడింది. కోసిన మాంసంముక్క ఒకటి, దానివైపు విసిరింది. అది కాసేపు వాసన చూసి, తిరస్కారంగా ఆ ముక్కను పక్కకు తోసింది. కోపం వచ్చి, చిత్ర దానిపైకి ఉల్లిగడ్డను విసిరింది. పేపరు చదువుకుంటూ, నీలీ రేడియో వింటూ, శివ అట్లాగే నిద్రపోయాడు. చిత్రకు ఉదయపు ఉత్సాహం ఇప్పుడు లేదు. ఎంతో ముఖ్యమైన వార్తను, మనసు మూలల్లోకి తోసివేసింది.

చికెన్ రోస్ట్, ఫ్రైడ్ రైస్ తింటూ, షంషాబాద్ రోడ్డులో త్రీ బెడ్ అపార్ట్‌మెంటుకు అడ్వాన్సు ఇచ్చానని, ఎంతో ఉత్సాహంగా చెప్పేడు శివ. చిత్ర ముఖంలో ఆనందమో, ఎగ్జైట్‌మెంటో ఊహించాడు. చికెన్ ముక్క నములుతూ, కిటికీలోంచి బయటకు చూస్తుంది, చిత్ర. "ఐ యామ్ ప్రగ్నెంట్" అని చెప్పాలనిపించింది. కానీ, ఎందుకో చెప్పాలనిపించలేదు.

ఆ మధ్యాహ్నం, వాళ్ళిద్దరూ, ఆదమరచి నిద్రపొయ్యారు. బయట కుండపోతగా వాన కురుస్తుంది. నిద్రలో చిత్రకు వింత కల వచ్చింది. ప్రశాంతంగా, ఏ దుఃఖం లేనట్లుగా ఉన్న శిశువు కల అది. శిశువు నిర్వాణమూర్తిలా, ఏ కదలిక లేని ముఖంతో, శిశువుకు కళ్ళు, నోరు, చెవులు ఏవీ లేవు. నున్నటి, గుండ్రటి ముఖం. చిత్రకు భయం వేసింది. పెద్దగా అరవాలనిపించింది. హఠాత్తుగా శిశువు శిరస్సు వందల ముక్కలుగా చిట్లిపోయి, ముఖమంతా రక్తం చారలై... చిత్ర భయంతో, నిద్రలేచింది. చిత్ర చీరంతా రక్తమే. లోపలి శిశువు, ఛిద్రమై రక్తపు వరదలుగా, ఆమె శరీరం లోపలి బయటకు వస్తూ!